## నేడు పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన

**మేడ్చల్, అక్టోబర్ 3:** కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి మేడ్చల్‌కు బుధవారం విచ్చేస్తున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రజితా రాజమల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగే బతుకమ్మ చీరల పంపిణీ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, స్పోర్ట్స్ కిట్ పంపిణీలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తు పాల్గొని, విజయవంతం చేయాలని ఆయన కోరారు. మేడ్చల్ మున్సిపాలిటీ ప్రారంభమయ్యే బతుకమ్మ చీరల పంపిణీలో మంత్రి మల్లారెడ్డి పాల్గొంటున్నారని చైర్‌పర్సన్ మర్రి దీపికానర్సింహారెడ్డి తెలిపారు.

## నేడు బోడుప్పల్‌లో బతుకమ్మ చీరల పంపిణీ

**బోడుప్పల్, అక్టోబర్03:** బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో బుధవాం బతుకమ్మ చీరలను పంపిణీ చేయనున్నట్లు మేయర్ బుచ్చిరెడ్డి, కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు బొమ్మక్ బాలయ్య ఫంక్షన్ హాల్లో,చెంగిచర్ల జలమండలి కార్యాలయం వద్ద ఉదయం12గంటలకు చీరల పంపిణీ కార్యక్రమం ఉంటుందని వారు వెల్లడించారు.

## నేడు విద్యుత్ ఫీడర్ల మరమ్మతు

**మేడ్చల్, అక్టోబర్ 3:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11కేవీ సాయిగీతా ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించనున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నామని ఏఈ వెంకట్ గౌడ్ తెలిపారు. ఉదయం 10 నుంచి 3.30 గంటలకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఆ ఫీడర్ పరిధిలో ఉన్న ప్రెస్టేజ్ పార్కు, మైపీ విల్లాస్, మల్లన్న కాలనీ, చైతన్య స్కూల్, కెవీ రెడ్డి నగర్, అంథమ్ విల్లాస్ తదితర ప్రాంతాలకు విద్యుత్ కోత ఉంటుందని ఆయన వివరించారు

## అక్రమ మద్యం విక్రేతల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితులు

**జవహర్‌నగర్, అక్టోబర్ 3:** అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపుల విక్రేతలపై జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం కథనం ప్రకారం... జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీపీఐకాలనీ, గిరిప్రసాద్‌నగర్, కేసీఆర్‌నగర్, బీజేఆర్‌నగర్, సాయిరాంనగర్‌లో గాంధీజయంతి రోజున అక్రమంగా మద్యం నిల్వచేసి అమ్ముతున్నారని విశ్వసనీయం సమాచారం మేరకు దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బుడిగె అశోక్, బింగి భారతి, గజబింకర్ శ్రీనివాస్, తల్ల జహంగిర్‌గౌడ్‌లపై ఎక్సైజ్ చట్టం ప్రకారం విక్రేతలపై కేసులు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న మద్యం 90వేల వరకు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## లూలూ మాల్ వెళ్లేవారు.. ప్రజా రవాణాను ఉపయోగించాలి



కేపీహెచ్‌బీ కాలనీలో ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తకుండా.. ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాలను మళ్లించేలా ఏర్పాట్లు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 3 : కేపీహెచ్‌బీ కాలనీలోని లూలూ మాల్‌కు వచ్చే వినియోగదారులు ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించాలని కేపీహెచ్‌బీ కాలనీ ట్రాఫిక్ సీఐ వి.నర్సింహారావు విజ్ఞప్తి చేశారు. కేపీహెచ్‌బీ కాలనీ హైటెక్‌సిటీ రోడ్డులో ఇటీవల ఏర్పాటు చేసిన లూలూ మాల్‌లో కేవలం 800 కార్లు, 800 బైక్‌లకు మాత్రమే పార్కింగ్ సౌకర్యం ఉందని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ మాల్‌లో వివిధ రకాల వస్తువులను కొనుగోలు చేసేందుకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు సొంత వాహనాలతో లూలూ మాల్‌కు చేరుతున్నారని ఈ మాల్‌లో సరిపడా పార్కింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల వాహనాలను రోడ్లపై, సమీపంలోని గల్లీలో పార్కింగ్ చేస్తున్నారని తెలిపారు. గత రెండ్రోజులుగా 10 నుంచి 15వేల వాహనాలు వస్తున్నట్లు తేలిందన్నారు. ఒక్కసారిగా వాహనాలు కేపీహెచ్‌బీ కాలనీలోని లూలూ మాల్‌కు రావడంతో కేపీహెచ్‌బీ కాలనీ హైటెక్‌సిటీ.. జేఎన్‌టీయూహెచ్ చౌరస్తా నుంచి కూకట్‌పల్లి వైపు.. జేఎన్‌టీయూహెచ్ చౌరస్తా నుంచి మియాపూర్ చౌరస్తా రోడ్డులో, ప్రగతినగర్ మార్గాలలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలిపారు. ఈ ట్రాఫిక్ రద్దీ వద్ద ఐటీ ఉద్యోగులు, పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వైద్యశాలలకు వెళ్లే అంబులెన్స్‌లు ట్రాఫిక్ వలయంలో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కాగా.. కేపీహెచ్‌బీ కాలనీలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలలో వాహనాలను మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఈ సమస్యను అధిగమించేందుకు లూలూ మాల్‌కు వచ్చే వినియోగదారులంతా వ్యక్తిగత వాహనాల్లో కాకుండా ప్రజా రవాణా వ్యవస్థ (మెట్రో రైల్, ఆర్టీసీ బస్సులలో) ప్రయాణాలు చేసి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సహకరించాలని కోరారు. కేపీహెచ్‌బీ కాలనీ, జేఎన్‌టీయూహెచ్ మెట్రో స్టేషన్లకు సమీపంలోనే లూలూ మాల్ ఉందని ఈ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

కొండాపూర్, అక్టోబర్ 3 : మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న గుజరాత్ ఉత్సవ్ మేళకు నగరవాసుల నుంచి విశేష స్పందన వస్తుందని నిర్వహకులు తెలిపారు. గుజరాత్‌కు చెందిన చేనేత, హస్త కళాకారుల ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలిపారు. మేళకు విచ్చేసే సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచేందుకు నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనల్లో పలువురి కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆద్యాంతం ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో కిరణ్మయూరి కళా నిలయం గురువులు దేశరాజు కిరణ్మయి శిష్య బృందం మూషిక వాహన, బ్రహ్మాంజలి, నాట్యహేలా, భామాకలాపం, అదిగో అల్లదిగో, నమశ్శివాయతేయ్, శ్రీనగర లహరి, ఆలోకయే బాలకృష్ణన్, కందర్ప జనక, బేహాగ్, తిల్లాన అంశాలను తన్మయి, సంహృత, రజని, లిఖిత, సహస్ర, జాహ్నవి, స్మృతి, సాత్విక, నిశిత, చరిష్మాలు కూచిపూడి నృత్యరూపకంలో నర్తించి అలరించారు.

## పేదలను ఆదుకోవడంలో లయన్స్‌క్లబ్ ముందంజ



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అల్లాపూర్, అక్టోబర్3: అభాగ్యులను నిరుపేదలను ఆదుకోవడంలో లయిన్స్ క్లబ్ ఎప్పుడు ముందుంటుందని 320లయన్స్‌క్లబ్ బంజారాహిల్స్ అధ్యక్షుడు కెల్లా వెంకట్ రావు అన్నారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ పరిధి శివాజీనగర్ గీతాంజలి స్కూల్‌లో సుమారు 650 మంది విద్యార్థులకు మాక్స్ విజన్ ఐ ఆస్పత్రి వారి సహకారంతో కంటి పరిక్షలు ఉచింతగా చేశారు. అనంతరం ఈఎస్ఐ ఆస్పత్రి ఆవరణలో 200 మందికి అల్పాహారం వితరణ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ సత్యనారాయణ, టి.వి.సుబ్బారావు, రోణంకి జగన్నాథం, ఎస్.ఆదినారాయణ, కృష్ణ, నాగరాజారావు, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత

మియాపూర్, అక్టోబర్ 3: రాష్ట్రంలోనే అతి పెద్ద నియోజకవర్గంగా పేరొందిన శేరిలింగంపల్లి అభివృద్ధి విషయంలో కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నట్లు మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు విప్ అరెకపూడి గాంధీ అన్నారు. అభివృద్ధి విషయంలో స్వీయ పోటీతో మరింత ఛాలెంజింగ్‌గా ముందుకు సాగుతున్నామని, రాబోయే అయిదేండ్లలో మరింత పురోగతిని చూపిస్తామన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్‌లో రూ. 2.30 కోట్లతో, హైదర్‌నగర్ డివిజన్‌లో రూ.73.70 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు కార్పొరేటర్లు దొడ్ల వెంకటేశ్ గౌడ్, నార్నె శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్ రంగారావు, అధికారులు, కాలనీవాసులతో కలిసి విప్ అరెకపూడి గాంధీ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విప్ గాంధీ మాట్లాడుతూ.. ఐటీ పరిశ్రమలకు నెలవైన శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల తోడ్పాటుతో ఎంతో ఉన్నదన్నారు.



ఆల్విన్ కాలనీ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో విప్ గాంధీ, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేశ్ గౌడ్, నార్నె శ్రీనివాస్‌రావు

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

ఉప్పల్, అక్టోబర్ 3 : పేద, మధ్యతరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో దోహదం చేస్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం హబ్సిగూడలోని ఎమ్మెల్యే నివాసంలోని కార్యాలయంలో ఉప్పల్‌కు చెందిన లబ్ధిదారు వాణికి రూ.30 వేల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వేముల సంతోష్ రెడ్డి, నేతలు సుధాకర్, భాస్కర్‌రెడ్డి, లేతాకుల రఘుపతిరెడ్డి, కాటెపల్లి రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గాయం శ్రీధర్‌రెడ్డి, పల్ల కిరణ్‌కుమార్‌రెడ్డి, పరమేశ్, నారాయణ, నాగిరెడ్డి, నవీన్‌రెడ్డి, భాను పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం కేసీఆర్ కృషి

చర్లపల్లి, అక్టోబర్ 3 : పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి డివిజన్‌కు చెందిన బొర్ర రమేశ్ అనారోగ్యానికి గురై చికిత్స పొందడంతో ఆయనకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అందజే శారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరంలాంటిదని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు గ్రేటర్ పరిధిలో బస్తీ దవాఖానలను ఏర్పాటు చేశారని ఆమె గుర్తు చేశారు. ప్రభుత్వం ప్రకటిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## చెత్తను రోడ్డు పక్కన వేయవద్దు..

రామంతాపూర్, అక్టోబర్ 3 : చెత్తను రోడ్డు పక్కన వేయవద్దని, చెత్తను రిక్షాలోనే వేయాలని కార్పొరేటర్ బండారు శ్రీవాణి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం డివిజన్‌లోని ఆర్టీసీ కాలనీ, తదితర ప్రాంతాల్లో శానిటేషన్ అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఎక్కడ చెత్త వేస్తున్నారో అక్కడ మొక్కలను నాటాలన్నారు. ఇంటి ముందుకు వచ్చే రిక్షాలో చెత్త వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ చందన, శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్, నాసు సతీష్, ఊరె నగేశ్‌గుప్తా, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలించవద్దు ..

ఉప్పల్, అక్టోబర్ 3 : ఉప్పల్‌లో అందుబాటులో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించవద్దని ఉప్పల్ గ్రామపెద్దలు, కాలనీవాసులు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎంతోకాలంగా ఉప్పల్ ప్రజలకు అందుబాటులో ఉన్న కార్యాలయాన్ని తరలించే ప్రయత్నం మానుకోవాలన్నా రు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మించాలన్నారు. సకల వసతులతో ఉప్పల్ భగాయత్‌లో నిర్మాణం చేపట్టాలన్నారు. అందరికి అందుబాటులో ఉన్న ఈ కార్యాలయాన్ని రామంతాపూర్‌కు తరలించే ప్రక్రియను మానుకోవాలని సూచించారు. అన్ని కార్యాలయాలు, రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్న ఉప్పల్ ప్రాంతాన్ని కాదని మరోచోటకు తరలించడం సబబు కాదన్నారు. ప్రైవేట్ వ్యక్తుల స్వలాభం కోసం తరలింపు చేపట్టవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో శివారెడ్డి, కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్, రామకృష్ణాగౌడ్, క్రిష్ణమాచారి, శేఖర్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, మల్లేశం, శ్రీధర్‌రెడ్డి, విఠల్, రాజు, స్వామి, జగదీశ్, సుందర్, శ్రీనివాస్, ప్రీతి, స్రవంతి పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు సత్వరం పూర్తిచేయాలి

ఉప్పల్, అక్టోబర్ 3 : డివిజన్‌లో మంజూరు చేసిన పనులను తక్షణమే పూర్తిచేయాలని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ అన్నారు. డివిజన్‌లోని రాఘవేంద్రనగర్, తదితర ప్రాంతాల్లో మంగళవారం కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలోని శివనర్సింగ్‌హోం ప్రాంతంలో రూ.20 లక్షల నిధులు రోడ్ల కోసం మంజూరు చేసినా పనులు చేయడంలేదన్నారు. ఈ మేరకు కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు సత్వరం పూర్తిచేసేవిధంగా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీఈ రూప, ఏఈ లింగారావు పాల్గొన్నారు.